# తీరని లోటు

## - చాపా గోవర్ధనరావు



సాయంత్రం ఆఫీసు నుండి వచ్చిన చలపతి వంటింట్లో భార్య కేకలకు ఉలిక్కిపడ్డాడు.

''ఛీ..ఛీ.. మాయదారి సంత. పెట్టిన ఒక్క వస్తువు కూడా వుంచినచోట వుండదు గదా!'' వసంత అరుస్తూ ఏడేళ్ల పెద్దకూతుర్ని దబదబా బాదేయడంతో, ఆ పిల్ల మిన్నూ మన్నూ ఏకమయ్యేలా పెడబొబ్బలు పెట్టింది. ఆ కేకలకి, ఏడ్పులకి రెండేళ్ల చిన్నకూతురు బెదిరిపోయి ఆరున్నొక్కరాగం అందుకొంది. అప్పుడే పలక, పుస్తకం అందుకున్న ఐదేళ్ల రెండో కూతురు అదిరిపడి వంటింట్లోకి తొంగిచూసింది.

''నిన్ను రాసుకోమన్లా... నా నాలుగూ నాకెట్టు అని వచ్చావా?'' అంటూ వసంత ఆ పిల్లనో లాగులాగి వీపుమీద రెండేసింది. డబ్బాలో రాళ్లుపోసి మోగించినట్టు డబడబలాడిందా పాప.

పొయ్యిమీద అన్నం అంతలో పొంగనే పొంగింది. వసంత వెళ్లి మూతను ఢామ్మని నేలకేసి కొట్టింది. ఆ దెబ్బతో వాలుకుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్న చలపతి ఈ లోకంలోకి దిగబడ్డాడు. చలపతికి తెలుసు, అప్పుడు తనెళ్లి కలగజేసుకుంటే తనమీద రెండు దులుపులు దులిపెయ్యొచ్చని! అందుకే అతను మౌనంగా వూరుకుండిపోయాడు. మేఘం వర్షించందే భూమి చల్లబడనివిధంగా అతని భార్య వసంత గబగబా బయటికొచ్చి మొగుడ్ని చూసి ఆరంభించింది.

''మీకేం చీమ కుట్టినట్టనిపించడం లేదుకదూ? అన్నిటికీ చచ్చేదాన్నున్నానుగా ఈ కొంపలో. అదేగా మీ వరసా?''

చలపతి తనకేమీ పట్టీపట్టనట్టు కూర్చుండిపోయాడు కుర్చీలో. దాంతో మరీ రెచ్చిపోయిందామె. ''అలా బెల్లం కొట్టిన రాయిలా కూర్చోకపోతే చిన్నదాన్ని కాస్త అలా బైటికి తీసుకెళ్లొచ్చుగా. అదలా గుక్కపెట్టి ఏడుస్తుంటే చోద్యం చూస్తున్నారా?''

తను ఇంట్లో కాలుపెట్టిన క్షణం నుంచీ తన భార్య నానా హంగామా చేస్తుంది. పని ఒత్తిడి వల్ల తన కోపాన్నంతా పిల్లల మీద చూపించి వాళ్లని తిట్టడం, కొట్టడం చేస్తుంది. పిల్లల్ని ఎలా పెంచాలో తెలీదు మహాతల్లికి.

భార్య నోరు తెరవకముందే అతనన్నాడు. ''ఇంతకీ నువ్వే ప్పేది చిన్నదాన్ని కొట్టినందుకు నీ చేతులు నొప్పెట్టాయా అని మేడగసందుకా?''

''పుల్లవిరుపు మాటలనడం మాత్రం మీకు చాతనవును. ఈ పెదవ పిల్లలతో వేగలేక చస్తున్నాను'' అంటూ చిన్నమ్మాయిని పక్క పక్కనే వదిలి, మూతి మూడు వంకర్లు తిప్పింది వసంత.

''పిల్లల్లేనోళ్లు పిల్లలో అని గోల పెడుతుంటే నీకేమో ఆ పిల్లలే బరువైపోతున్నారు!''

''ఆ ... పిల్లల మీద మీకు మహాప్రేమ. ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. ఇంక చాలండీ, ఆపరేషన్ చేయించుకోమంటే విన్నారా! వంశోద్ధారకుడు వుండాలన్నారు. మళ్లీ నెల తప్పాను. పోనీ- పిల్లలు లేక బాధపడుతున్న మా చెల్లెలికి రెండోదాన్ని ఇచ్చేద్దామంటే వద్దొద్దని గోల పెట్టారు.''

''వెర్రిమాయ్. కన్నదెందుకు, పరాయివాళ్లకి ఇచ్చెయ్యడానికా?'' అంటూ అతను కళ్లెర్రజేసేసరికి ఆమె మౌనం వహించింది.

పిల్లలు ''పిన్నీ...పిన్నీ...'' అంటూ బైటికి పరుగుతీసేసరికి వాళ్లు అటు చూసేరు. రిక్షావాడికి డబ్బులిచ్చి పంపిస్తున్న వసంత చెల్లెలు సునీత కనిపించింది. ఎదురొచ్చిన పిల్లల చేతుల్లో బిస్కెట్ పేకెట్స్ పెట్టిందామె.

''రావే...రా...'' అంటూ ఆప్యాయంగా చెల్లెల్ని పలకరించింది వసంత.

''ఊళ్లో అందరూ బావున్నారా? మా తమ్ముడెలా వున్నాడు?'' అంటూ కుశలప్రశ్నలు వేశాడు చలపతి.

''ఏం బాగులే బావా, ఆయనకి జీవితం మీద విరక్తి పుట్టింది. రోజురోజుకీ పిల్లల గురించి దిగులు పడిపోతున్నారు'' అంది.

''అదేంటీ! మీకు వయసేం అయిపోయిందని అంత దిగులు పడాలి. రేపో మాపో పుట్టకపోతారా ఏంటి?'' చెల్లెల్ని లోపలికి తీసుకెళ్లింది వసంత.

పిన్ని వచ్చిందన్న సంతోషంలో పిల్లలు ఒకటే అల్లరి చేస్తున్నారు. చెల్లెలుతో కబుర్లు చెబుతూ వసంత వాళ్ల అల్లరి విషయం పట్టించుకోలేదు.

భోజనాలయ్యాక ఆ మాటా, ఈ మాటా మాట్లాడాక తీరిగ్గా అసలు విషయం చెప్పింది సునీత. ''కనీసం ఈసారన్నా మీకు పుట్టిన బిడ్డను మాకు ఇచ్చెయ్యి అక్కయ్యా'' ప్రాధేయపడుతూ అడిగింది.

ఆమెను చూస్తే ఆ ఇద్దరికీ జాలేసింది. కాని ఏం సమాధానం చెప్పగలరు. ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

''ఏం బావా మాట్లాడరు?''

''అది కాదమ్మా... అబ్బాయి గురించే కదా మేం ఎదురుచూస్తున్నాం'' అంటూ తీవ్రాలోచనలో పడిపోయాడు చలపతి. అదే అదునుగా సునీత బావగారిని బ్రతిమాలడం ప్రారంభించింది.

''సరేనమ్మా... నీ ఇష్టప్రకారమే చెయ్యి. ఈ కాన్పులో ఏ బిడ్డ పుట్టినా నువ్వే తీసుకో'' అని బావగారు అనేసరికి ఆమె ఆనందం పట్టలేకపోయింది. ఆ సంతోషంలో ఉక్కిరి బిక్కిరి అయిపోయిన సునీత కళ్లలో నీళ్లు తిరిగాయి.

• • •

కాలచక్రం గిర్రున తిరిగింది. పండంటి మగబిడ్డను ప్రసవించింది వసంత. కాన్పు కష్టమైతే ఆపరేషన్ చేశారు. నెలలు దగ్గరపడేసరికి వసంత పిల్లలతో ఒక్కర్తీ చేసుకోలేదని తనే దగ్గరుండి అక్కయ్యకు అన్ని సేవలు చేసింది. కంటికి రెప్పలా చూసుకుంది సునీత. అక్కయ్యకు పుట్టిన బిడ్డ తనకు పుట్టినట్టుగానే ఎంతో సంబరపడిపోయింది. ''చూసావా అక్కా మా అబ్బాయిని'' అంది మురిసిపోతూ.

''నా ముద్దుల కొడుకు'' అంది వసంత.

''నా బిడ్డేగా అక్కా, నాకు ఇస్తానన్నావు!'' అంటూ గుర్తుచేసింది సునీత.

''అలా వీల్లేదమ్మా! కావాలంటే ఈసారి పుట్టే బిడ్డనిస్తా. వీణ్ణి మాత్రం ఇవ్వలేను, అంతే!'' అంది వసంత నిశ్చయంగా. అప్పుడే అక్కడికొచ్చిన చలపతి తెల్లమొహం వేశాడు. అక్కయ్య అలా నిక్కచ్చిగా చెప్పేసరికి సునీత నోట మాట లేదు!

★